22న దిశ కమిటీ సమావేశం

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించేందుకు 22న జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 22న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించే దిశ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు, జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి జడ్పీ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జడ్పీ సీఈవో డీఆర్డీవో, ఎల్డీఎం తపాలాశాఖ అధికారులు, జిల్లాలో నిర్దేశిత కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న అధికారులు, జిల్లా నోడల్ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

గత సర్కార్‌లో సాగులో లేని
భూములకూ రైతుబంధు

- రూ.25వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- 'వరి సాగుతో ఉరి' అన్నది కేసీఆర్
- దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బీఆర్ఎస్ నాయకుల ధర్నాలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంలో శంకుస్థాపన చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చి రూ.25వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ సర్కార్‌కే దక్కిందని వ్యవసాయ శాఖ మంత్రి తమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన వందల కోట్ల అప్పులను తామే తీరుస్తున్నామన్నారు. ఖమ్మం నగరంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వంలో రైతు పథకాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,600కోట్లు అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టిందన్నారు. ఒకే ఒక్క రైతుబంధు పథకం పేరుతో వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, డ్రిప్ ఇరిగేషన్ పథకాలను బొందపెట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వరి ధాన్యం కొనుగోలు చేయలేక వరి పంట సాగు చేస్తే ఉరేనని మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. రైతులు ఏ పంటలు సాగు చేయాలో కూడా కేసీఆర్ నిర్ణయించి రైతులను అయోమయంలోకి నెట్టారన్నారు. ఇప్పుడు రైతులపై కపట ప్రేమను చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులు, రైతు కూలీలు, పేదల పక్షాన నిలబడుతుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు కనీసం పచ్చి రొట్ట విత్తనాలకు సబ్సిడీ కూడా ఇవ్వలేక పోతే తాము వచ్చాక ఇచ్చామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై రైతులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు విశ్వాసం లేకపోవటంతోనే కాంగ్రెస్ పార్టీని (మిగతా 6వ పేజీలో)

అసలు అక్కడ నిర్మాణమే లేదు. కానీ కార్పొరేషన్ అధికారులకు మాత్రం అక్కడ ఏకంగా ఒక ఇల్లే కనిపించింది. దానికి వారు కొలతలు కూడా వేశారట. 7.1 మీటర్ల పొడవు, 8.5మీటర్ల వెడల్పులో కట్టిన సదరు నిర్మాణం నివాసం కోసం వినియోగిస్తున్నారని, అందుకుగాను సంబంధిత ఇంటికి వార్షికానికి రూ.1,596 పన్ను విధిస్తూ అసెస్‌మెంట్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇది ఖమ్మం నగరంలోని చెరువుబజార్ ప్రాంతంలోని రాతిదర్వాజకు సమీపంలో ఓ ఖాళీ స్థలానికి అధికారులు వేసిన అసెస్‌మెంట్. గతంలో మాదిరిగా ఖమ్మంనగరంలో మళ్లీ పాత పద్ధతిలోనే దొంగ అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది.

కొత్త వారూ పాతదారిలోనే..!

ప్రక్షాళన జరిగినా ఖమ్మం కార్పొరేషన్‌లో పద్ధతి మారలేదు



అసెస్‌మెంట్‌లో ఉన్న ఇల్లు



సంబంధిత ఇంటి నెంబరులో ఉన్న ఖాళీస్థలం

- అందినకాడికి దండుకుని దొంగ అసెస్‌మెంట్లు
- ఖాళీ స్థలాలకు మళ్లీ ఇంటినెంబర్ల కేటాయింపు
- గతంలో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే కారణం ?

ఖమ్మం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో గతంలో అనేక అక్రమాలు జరిగాయి. అందినకాడికి దండుకుని దొంగ అసెస్‌మెంట్లు వేసి దర్జాగా ప్రభుత్వ భూములను అక్రమార్కుల పరం చేశారు. ఆయా అక్రమాలు ఆధారాలతో సహా నిరూపణ కూడా జరగడంతో ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ జరిగింది. దాంతో గతంలో ఉన్న కమిషనర్ ఒక్క ఏడాదికి సంబంధించిన అసెస్‌మెంట్లు మాత్రమే పరిశీలించి సంబంధిత విభాగంలోని అధికారులతో సహా, పలువురు బిల్ కలెక్టర్లను మార్చి ప్రక్షాళన చేశారు. కానీ ఆ విభాగం పద్ధతి ఏమాత్రం మారలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ విభాగంలో కొత్త అధికారులు విధులు నిర్వర్తిస్తున్నా కాసుల కక్కుర్తి మాత్రం కొనసాగుతూనే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తవారు సైతం అందినకాడికి దండుకుని పాత పద్ధతిలో దర్జాగా దొంగ అసెస్‌మెంట్లు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖాళీ స్థలాలకు మళ్లీ ఇంటినెంబర్లు

ప్రభుత్వ స్థలాలకు, ఎకరాల్లో ఉన్న భూములకు, అసైన్‌మెంట్ భూముల్లో ఎకరాల్లో ఉన్న భూములకు, ఖాళీ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఉన్నట్టుగా చూపి దర్జాగా అసెస్‌మెంట్లు వేసిన సంఘటనలు గతంలో వందల సంఖ్యలో ఉన్నాయి. అందుకోసం ఒక్కో అసెస్‌మెంట్‌కుగాను రూ.80 వేలనుంచి రూ.లక్ష వరకు తీసుకుని ఇంటి నెంబర్లు కేటాయించినట్టు ఆరోపణలున్నాయి. ఆ సమయంలో చాలా తక్కువ సంఖ్యలో దొంగ అసెస్‌మెంట్లు ఉన్నట్టుగా చూపించిన అధికారులు.. అనధికారికంగా బోలెడన్ని అసెస్‌మెంట్లను డీయాక్టివేట్ చేశారు. 58, 59 జీవోల ద్వారా జరిగిన అక్రమ క్రమబద్ధీకరణలోనూ మూలకారణంగా ఆయా దొంగ అసెస్‌మెంట్లే నిలిచాయి. అంతటిస్థాయిలో అక్రమాలు జరిగినట్టు గుర్తించిన గత కమిషనర్ ఆయా అధికారులను కేవలం సెక్షన్ మార్చి చేతులు దులుపుకొన్నారన్న విమర్శలు వినిపించాయి. అయితే వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా ఇంటి నెంబరు కేటాయించాలంటే ప్రతీ అసెస్‌మెంట్‌ను బిల్ కలెక్టర్లు వెళ్లి పరిశీలించిన తర్వాత ఆర్ఐ, ఆర్‌వోలు పరిశీలించిన తర్వాత మాత్రమే వాటికి అప్రూవల్ ఇవ్వాలని నిర్ణయించారు. కాగా ప్రస్తుతం కొత్తగా ఆ విభాగంలో విధులు నిర్వర్తించే అధికారులు బిల్ కలెక్టర్లకు తెలియకుండానే ఇంటినెంబర్లు కేటాయించడం గమనార్హం. అన్నీ సక్రమంగా ఉండి, చిన్నపాటి నిర్మాణాలు చేసుకుని ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని వారాల తరబడి తిప్పే సంబంధిత అధికారులు.. దొంగ అసెస్‌మెంట్ వేసిన వారికి మాత్రం రోజుల వ్యవధిలోనే అప్రూవల్ ఇవ్వడం గమనార్హం. సెల్ఫ్ అసెస్‌మెంట్ వేసి నేరుగా సంబంధిత సెక్షన్‌లోని అధికారులను కలిసి అమ్యామ్యాలు సమర్పించుకుంటే స్థలంతో సంబంధం లేకుండా, నిర్మాణాలతో పనిలేకుండా నెంబర్లు కేటాయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఒక్కో అసెస్‌మెంట్‌కుగాను రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా గతంలో ఇంటి నెంబర్ ఉన్న స్థానంలో కొత్తగా మరో ఇంటినెంబర్ కేటాయించి వివాదాలకు కారణమయ్యే పరిస్థితులను అధికారులు కల్పిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఖైకొండాయిగూడెంలో కొన్ని ఎకరాల్లో స్థలాలకు అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయించిన (మిగతా 6వ పేజీలో)

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం

- నేడు ప్రారంభించనున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- జిల్లాలో 9 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు
- మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521

6



త్వరలో పాడి రైతులకు ప్రోత్సాహకాలు

- పాల సేకరణ పెంచేందుకు కృషి చేస్తున్నాం
- విజయ డెయిరీ డీడీ మోహన మురళి

ఆంధ్రజ్యోతి: పాల ప్రోత్సాహకాలు ఆగిపోవటం వల్ల విజయ డెయిరీకి పాలు పోసే వారి సంఖ్య తగ్గుతుందనే ప్రచారం జరుగుతోంది.. ఇందులో నిజం ఉందా?

డెయిరీ డీడీ: గత మూడేళ్లుగా పాల ప్రోత్సాహకాలు ఆగిపోయాయి. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాను. త్వరలోనే ప్రోత్సాహకాలు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది.

ఆంధ్రజ్యోతి: డెయిరీలో ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై ఏం చర్యలు తీసుకుంటున్నారు ?

డెయిరీ డీడీ: గతంలో అవినీతి జరిగిన మాట వాస్తవమే. అవినీతి చేసిన ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో అవినీతిని అరికట్టగలిగాం. ప్రస్తుతం డెయిరీ అభివృద్ధిపై దృష్టిపెట్టాం. సమిష్టిగా పనిచేసి, పాలసేకరణ పెంచేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాడి రైతులు ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో డెయిరీకి నష్టం జరుగుతుంది. దీనిపై ఏం చర్యలు తీసుకుంటారు ?

డెయిరీ డీడీ: ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పాడిరైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాం. ఎవరైనా ఉద్యోగులు పాడిరైతుల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. విజయ డెయిరీకే పాలు పోసేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాల బిల్లులు సరిగా రావటం లేదని రైతులు ప్రైవేటు డెయిరీల వైపు చూస్తున్నారన్న ప్రచారంలో ఉంది ?

డెయిరీ డీడీ: గతంలో పాలబిల్లులు పెండింగ్‌లో ఉండేవి. ఇప్పుడు సకాలంలో చెల్లిస్తున్నాం. ప్రతి 15రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి జిల్లాలో పాడిరైతులు విజయ డెయిరీకే పాలు పోసేందుకు మొగ్గు చూపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం టౌన్

నూతన రెవెన్యూ చట్టం ప్రజలకు వరం

- గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులను నియమించాలి
- గత ప్రభుత్వంలో వీఆర్వోలకు తీవ్ర అవమానం
- వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నూతన రెవెన్యూ చట్టం రాష్ట్ర ప్రజలకు వరం లాంటిదని వీఆర్వోల సంఘం(ట్రోవా) రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామరెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేందుకు గ్రామస్థాయిలో మళ్లీ రెవెన్యూ అధికారులను నియమించాలన్న రేవంత్ సర్కార్ ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానంతో రాష్ట్రంలో 70లక్షల మంది రైతుల్లో 50లక్షల మంది భూ బాధితులుగా మారారన్నారు. ఆ ప్రభుత్వం అమలుచేసిన 'ధరణి' విధానం అన్ని వర్గాల రైతులకు తీరని నష్టాన్ని కలిగించిందన్నారు. ఖమ్మంలోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 5,139 మంది వీఆర్వోలకు తీవ్ర అవమానం జరగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం కల్పిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంలో చనిపోయిన 178 మంది వీఆర్వోల కుటుంబాల్లో వెలుగులు నింపినట్లవుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న 'నూతన రెవెన్యూ చట్టం 'భూమాత' తోనే రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా 70లక్షల మంది రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలతోనే పూర్వ వీఆర్వోలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. గ్రామస్థాయిలో 64 రకాల విధులను నిర్వర్తించి ప్రభుత్వ ప్రతినిధులుగా గౌరవంగా బతికిన వీఆర్వోల వ్యవస్థను నాటి సీఎం కేసీఆర్ అహంకార ధోరణితో రద్దుచేయడమే కాకుండా రాష్ట్రంలోని 5,139 మంది వీఆర్వోలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఉద్యోగ భద్రతలేక తీవ్ర మానసిక వేదనతో 178మంది వీఆర్వోలు బలవన్మరణాలు, మానసిక రుగ్మతలతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన రెవెన్యూ చట్టం 'భూమాత'తోనే రాష్ట్రంలోని రైతులకు, సమాన్య ప్రజలతో పాటు వీఆర్వోలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. వీఆర్వోలను లంచగొండులుగా, అవినీతిపరులుగా కేసీఆర్ ప్రభుత్వం చిత్రీకరించి మానసిక హింసకు గురిచేసిందన్నారు కారుణ్య నియామకాలు కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేసే గ్రామస్థాయి రెవెన్యూ అధికారులను పునరుద్ధరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సున్నం రామరావు, ప్రసాద్ వి. రామారావు జిల్లా నాయకులు స్వామిదాసు, నాగేంద్రబాబు ఎస్‌కే. సుభాని, లక్ష్మీనర్సు, కృష్ణ, ఎలమంద, వరలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటరమణ, మేడికొండ బాలయ్య, బండ కృష్ణయ్య, చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గరికె ఉపేంద్రరావు

నేడు కొత్తగూడెంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

హాజరుకానున్న జాతీయ నేతలు



కొత్తగూడెంలో ప్రధాన కూడలిలో ఐద్వా తోరణాలు

కొత్తగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభలకు భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం ముస్తాబైంది. పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం ఈ మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఐద్వా జెండాలు, తోరణాలతో కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన కూడళ్లను అలంకరించారు. మహిళా ప్రదర్శన ప్రారంభమయ్యే పాత డిపో నుంచి విద్యానగర్ వరకు, బస్టాండ్ సెంటర్ నుంచి ప్రతినిధుల సభ జరిగే కొత్తగూడెం క్లబ్ వరకు జెండాలు, తోరణాలు, మహిళా అమరవీరుల ఫొటోలతో అలంకరణ చేశారు. ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 600మంది ప్రతినిధులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. సోమవారం నిర్వహించే బహిరంగసభకు దేశ వ్యాప్తంగా అనేక మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించి మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందాకరత్, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే.శ్రీమతి, ప్రధాన కార్యదర్శి మరియం, దావేలే వంటి ముఖ్యనేతలు విచ్చేస్తున్నారు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులు, కేంద్ర ప్రభుత్వ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలన్నింటినీ ఈ మహాసభల్లో నాయకులు ప్రజలకు వివరించనున్నారు. మహాసభల నిర్వహణ కోసం ఇప్పటికే ప్రజా సంఘాల నాయకులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ మహాసభల విజయవంతానికి కృషి చేయాలని ఐద్వా నాయకులు కోరారు.

ఖమ్మం జిల్లాలో
పలుచోట్ల వర్షం

- ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం
- బోనకల్ మండలంలో పిడుగుపడి రైతు మృతి

ఖమ్మంటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఖమ్మం జిల్లాలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల వర్షం కురవటంతో వాతావరణం చల్లబడింది. జిల్లాలో మధిరలో 2.98 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కాగా పెనుబల్లిలో 1.7సెం.మీ, కల్లూరులో 1.6సెం.మీ, చింతకాని మండలం నాగులవంచలో 1.3సెం.మీ, ఎర్రుపాలెంలో 1.2సెం.మీ, బోనకల్ మండలం రావినూతనలో 1.1సెం.మీ, పెనుబల్లి మండలం గౌరారంలో 1సెం.మీ వర్షం కురిసింది. బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో పిడుగుపడి ఓ రైతు మృతి చెందాడు. పొలంలో అరక దున్నేందుకు వెళ్లిన రైతు సంగెపు నారాయణ(56) పొలంలో అరక దున్నుతుండగా పిడుగుపడి (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి దేవస్థానంలో
అంతర్గత బదిలీలు

- ఉత్తర్వులు జారీ చేసిన ఈవో

6

సాహితీవనంలో
విరిసిన కుసుమం

- వృత్తి డీటీపీ ఆపరేటర్.. ప్రవృత్తి కథా రచన
- సాహిత్యంలో ఖమ్మం ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న రాచమళ్ల ఉపేందర్
- సామాజిక అనుభవాలే ఆయన కథా వస్తువులు



మీ సేవలకు సెల్యూట్

- పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి
- నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

7

వీడిన మహిళ
హత్యకేసు మిస్టరీ

- భర్తే మూడో భార్యతో కలిసి హతమార్చిన వైనం
- అరెస్టు భయంతో లొంగిపోయిన నిందితులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

భద్రాద్రి దేవస్థానంలో అంతర్గత బదిలీలు

» ఉత్తర్వులు జారీ చేసిన ఈవో

భద్రాచలం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అంతర్గత బదిలీలు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు 13 మంది రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అధికారిక ఉత్తర్వులు ఆదివారం జారీ చేశారు. సీనియర్ అసిస్టెంటు ఎం.కృష్ణ స్వామి సీఆర్వో, (సత్రాల పారిశుధ్యం, ఫైల్ కరస్పాండెన్స్‌తో సహా) అన్నదానం, కల్యాణకట్ట బాధ్యతలు కేటాయించారు. జూనియర్ అసిస్టెంటు ఆర్.శ్రీకాంత్ భూములు, కౌలు, లీగల్ మ్యాటర్స్‌ను కేటాయించారు. జూనియర్ అసిస్టెంటు పి.రాకేష్ అకౌంటెంట్‌తో పాటు అదనంగా క్యాషియర్ విధులు, టీకేవీవీఎస్ శ్రీనివాసరావు ఆలయ పరిశీలకులు, ఆలయ ఫైళ్ల కరస్పాండెన్స్ చూడనున్నారు. జూనియర్ అసిస్టెంటు బి.సుష్మా ఎస్టాబ్లిష్‌మెంటు, కె.కుమారి పోస్టు ఆడిట్, వార్షికోత్సవాలు, శ్రీరామదీక్ష, దత్తత దేవాలయాలతో పాటు అదనంగా రికార్డు రూము, డిస్పాచ్ విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. వీరితో పాటు పలువురు ఉద్యోగులకు ప్రస్తుతం పని చేస్తున్న వారికి నూతన విభాగాల్లో బాధ్యతలను అప్పగించారు. నూతనంగా కేటాయించిన విధుల్లో వెంటనే చేరి నివేదిక సమర్పించి పూర్తిస్థాయి చార్జి లిస్టులను కార్యాలయానికి సమర్పించాలని ఈవో ఆదేశించారు. కేటాయించిన విధుల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా బాధ్యతలు నిర్వహించాలని లేకపోతే కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.


రామాలయంలో ఎస్పీ రోహిత్‌రాజు దంపతులు

రామాలయంలో ఎస్పీ పూజలు

భద్రాచలం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారిని ఎస్పీ రోహిత్‌రాజు దంపతులు దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

సాహితీ వనంలో విరిసిన కుసుమం

» వృత్తి డీటీపీ ఆపరేటర్.. ప్రవృత్తి కథా రచన
» సాహిత్యంలో ఖమ్మం ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న రాచమళ్ల ఉపేందర్
» సామాజిక అనుభవాలే ఆయన కథా వస్తువులు
» ఆయన కలం నుంచి వెలువడిన అనేక కథలకు బహుమతులు
» పలు మాగజైన్లలో ప్రచురణ



సాహితీ ప్రపంచంలో 'ఖమ్మం కవిత్వ గుమ్మం' అనే నానుడి ఉంది. అనేక మంది తమ రచనలతో సాహిత్యానికి సేవ చేస్తూ గుర్తింపు పొందారు. కవిత్వమే కాకుండా కథా, వ్యాస రచనల్లోనూ కొందరు తమ ప్రతిభను చూపి తామూ తక్కువేం కాదని నిరూపించుకుంటున్నారు. అలాంటి వారిలో రాచమళ్ల ఉపేందర్ ఒకరు.. వృత్తి పరంగా ఇతడు డీటీపీ ఆపరేటర్ కానీ ప్రవృత్తి మాత్రం కథా, వ్యాస రచన.. సాహిత్యంలో బహుముఖంగా రాణిస్తూ ఖమ్మం సాహిత్యాన్ని మరింత విస్తరింపచేస్తున్నాడు.

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన ఉపేందర్ నగర పరిధిలోని యూపీహెచ్ కాలనీలో ఉంటూ ఖమ్మం రైల్వే స్టేషన్‌రోడ్డులో డీటీపీ ఆపరేటర్‌గా చిరు ఉద్యోగం చేస్తున్నాడు. ఒక పక్కడ వృత్తి పనులు చేస్తూనే తన మదిలోని ఆలోచనలను కథలుగా మలుస్తూ కథా సాహిత్యంలో రాణిస్తున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించి అనేక కథల పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. డీటీపీ ఆపరేటర్‌గా రోజంతా కష్టపడి పనిచేసినా సాహిత్యానికి తనవంతుగా సమయం వెచ్చిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆరు కథల సంకలనాలు, రెండు కవిత్వ సంకలనాలతో పాటు ఒక వ్యాస సంకలనాన్ని వెలువరించిన ఈయన పలు అవార్డులు, పురస్కారాలు పొందాడు. సమాజంలో ఎదురయ్యే సంఘటనలు, సందర్భాలను కథలుగా మార్చి వాటికి సంబంధించిన సమస్యలకు తన వంతుగా పరిష్కార మార్గాలను సూచించటం ఈయన కథల ప్రత్యేకత.. ఈయన రాసిన అనేక కథలు పలు పత్రికలకు సంబంధించిన సండే మ్యాగజైన్లలో ప్రచురితం కావడంతో పాటు రేడియోలో కథానికలుగా ప్రసారమయ్యాయి.

ఉపేందర్ వెలువరించిన కథా సంకలనాలు..

స్పర్శ, జ్ఞాపకం, ఉల్లిగడ్డాయనమః, తాలుగింజ, మేడిపండు, వీటితోపాటు మట్టిపరిమళం, పగిలిన అద్దం అనేక కవిత్వ సంకలనాలు ముద్రించాడు. ఇతర కవులు, రచయతల కథలు, కవిత్వ సంపుటాలను విశ్లేషిస్తూ ఒక దినపత్రికలో రాసిన సమీక్షలను 'కలం చూపు' అనే పేరుతో విడుదల చేశాడు. ఈయన రాసిన 'చెదరని గూడు' అనే కథ కన్నడలోకి, 'విరుగుడు' అనే కథ ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి.

రైటర్స్ కార్నర్

సాధించిన బహుమతులు

రాచమళ్ల ఉపేందర్ అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందాడు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికావారు నిర్వహించిన కవిత్వ పోటీల్లో 'రెండు కన్నీటి బొట్లు' అనే కవితకు రాళ్లబండి కవితా ప్రసాద్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాడు. 2011లో ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక నిర్వహించిన కథల పోటీల్లో 'మమతల మనిషి' అనే కథకు బహుమతి పొందాడు. 2012లో 'అర్హత' అనే కథకు సోమేపల్లి జాతీయ పురస్కారం పొందాడు. 2013లో రజినీ తెలుగు సాహితీ కథల పోటీల్లో 'జ్ఞాపకం' అనేక కథకు బహుమతి పొందాడు. అదే ఏడాది నవ్యవారపత్రిక నిర్వహించిన కథల పోటీల్లో 'నాన్ననయ్యాను' అనే కథకు సాహితీ కిరణం మాసపత్రిక నిర్వహించిన కథల పోటీల్లో 'నాటుకోడి' అనే కథకు బహుమతులు అందుకున్నాడు. 2015లో 'కొత్తబంధం' అనే కథకు అదే సంవత్సరం సోమేపల్లి జాతీయ పురస్కారం లభించింది. మేళ్లచెరువు పరమయ్య, నాగరత్నం అవార్డు, డాక్టర్ యలమంచిలి రాధాకృష్ణమూర్తి పురస్కారం అందుకున్నాడు. 2016లో చినుక మాసపత్రిక పోటీల్లో 'అదృశ్యవల' అనే కథకు జాతీయ బహుమతి అందుకున్నాడు. 'కురిసిన మేఘం' అనే కథకు బలివాడ కాంతారావు బహుమతి, 'బావి' అనే కథకు బతకమ్మ అవార్డును పొందాడు. 2017లో 'చెరగని గీతలు' అనే కథకు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా బహుమతి, 2019లో ఈనాడు కథా విజయం పోటీల్లో 'చేదెక్కిన తీపి' కథకు బహుమతి పొందాడు. 'విరుగుడు' కథా సంపుటికి 2021లో తెలుగు యూనివర్సిటీ కీర్తిపురస్కారం పొందాడు. వేదగిరి రాంబాబు అవార్డు, 'తడిసిన గుండె' కథకు తెలుగుతల్లి కెనడా అవార్డు పొందాడు. సాహిత్యంలో విశేష సేవలకు బుక్కా రాములమ్మ సూరయ్య సాహితీ స్ఫూర్తి పురస్కారం అందుకున్నాడు. కెనడా డే సందర్భంగా 2023లో తెలుగు తల్లి కెనడా నిర్వహించిన పోటీల్లో 'ఆక్సిజన్' అనే కథకు బహుమతి పొందాడు. ఇటీవల హాసిని రామచంద్ర ఫౌండేషన్స్ (హెచ్ఆర్సీ) నిర్వహించిన కథల పోటీల్లో 'సెల్ఫీ' అనే కథకు జాతీయ బహుమతిని ప్రముఖ కవి ఆశారాజు చేతుల మీదుగా అందుకున్నాడు.


ఆశారాజు చేతుల మీదుగా హెచ్ఆర్సీ అవార్డు అందుకుంటున్న రాచమళ్ల ఉపేందర్



ఉపేందర్ వెలువరించిన కొన్ని పుస్తకాలు

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	44
వంకాయ	30
గుత్తి వంకాయ	36
బీరకాయ	54
పచ్చిమిర్చి	44
కాకరకాయ	44
బెండకాయ	38
పొట్లకాయ	60
దోసకాయ	58-60
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	38
దొండ	32-40
సొరకాయ	40
క్యారెట్	64
క్యాప్సికం	80
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్లుట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పలు సమస్యలపై కేంద్రమంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న తాండ్ర

ఖమ్మం బైపాస్‌రోడ్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంట్ పరిధిలో పలు సమస్యలపై కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఢిల్లీలోని తన కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ కంటెస్టడ్ బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు కలిసి వినతిపత్రం అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2500 ఎకరాల వ్యవసాయ భూమికి నీటి వసతి కల్పిస్తూ 1,248 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సింగభూపాలెం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, ఖమ్మంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేకనిధులు కేటాయించి అభివృద్ధిచేయాలని కోరినట్టు తాండ్ర పేర్కొన్నారు.ఈసందర్భంగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రితో అభివృద్ధికోసం మట్లాడతానని హామీ ఇచ్చినట్టు వినోదరావు తెలిపారు.

సండ్ర కుమారుడి రిసెప్షన్‌కు మంత్రి తుమ్మల


వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య - మహాలక్ష్మిల కుమారుడు భార్గవ్ వివాహం రిసెప్షన్‌కు ఆదివారం పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నగరంలోని బోనకల్‌రోడ్డులో లక్ష్మిగార్డెన్స్‌లో జరిగిన ఈవేడుకకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు,,తాటి వెంకటేశ్వర్లు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం

» నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లకు సిద్ధమైంది. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు వద్ద వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీసీఐ పత్తి కొనుగోళ్ల లాంచనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా మార్కెటింగ్‌శాఖ సీసీఐ కొనుగోలు కేంద్రాలకు నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లు వద్ద ఇప్పటికే సీసీఐ సాఫ్ట్‌వేర్ వ్యవస్థను పొందుపరిచి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ట్రయల్‌రన్ నిర్వహించారు.

9 కేంద్రాల్లో పత్తి కొనుగోలుకు రంగం సిద్ధం

పత్తి కొనుగోళ్లకు సీసీఐ జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఖమ్మం మార్కెట్ పరిధిలో గుర్రాలపాడు జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు, తల్లంపాడు సాయిబాలాజీ జిన్నింగ్ మిల్లు, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలో ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ జిన్నింగ్ మిల్లు, మద్దులపల్లి మార్కెట్ పరిధిలో పొన్నెకల్ గ్రామంలోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లులో, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్లు, వైరా మార్కెట్ పరిధిలో తల్లాడ స్టాఫిల్‌రిచ్ జిన్నింగ్ మిల్లు, మధిర మార్కెట్ పరిధిలో మంజీత్, అమరావతి, శ్రీ శివగణేష్ జిన్నింగ్ మిల్లుల్లో నేరుగా రైతులు తమ పంటను విక్రయించవచ్చు.



మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521

సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ పంటను భారత పత్తి సంస్థ నిర్ధేశించిన ప్రమాణాల ప్రకారం తీసుకురావాల్సి ఉంటుంది. సదరు పత్తిలో 8 శాతం లోపు తేమ ఉంటే క్వింటాలుకు రూ.7,521లు, 9 శాతానికి రూ.7,446లు, 10 శాతానికి రూ.7,295లు, 11, 12 శాతం ఉంటే రూ.7,220 చెల్లించనున్నారు. రైతులు తమ ఆధార్, ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ ఖాతా, భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. విక్రయించిన పంటకు సంబంధించిన నగదు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు.

ఖమ్మం జిల్లాలో పలుచోట్ల వర్షం



(5వ పేజీ తరువాయి)

అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం ఎదులు మాత్రమే ఇంటికి రావడంతో అతడి కోసం కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతగ్గా పొలంలో కాలిన గాయాలతో నారాయణ మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. దాంతో పిడుగుపడి చనిపోయాడని నిర్ధారించుకున్నారు. మరో ఘటనలో ఇదే మండలంలోని బ్రాహ్మణపల్లిలో పిడుగుపాటుకు మడుపల్లి నాగేశ్వరరావు అనే రైతుకు తీవ్రగాయాలయ్యాయి. పొలంలోకి వెళ్లిన రైతు ఉరుములతో కూడిన వర్షం రావటంతో చెట్టుకిందకు వెళ్లాడు. చెట్టు సమీపంలో పిడుగు పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

కొత్తవారూ పాతదారిలోనే !

(5వ పేజీ తరువాయి)

సంఘటన వెలుగులోకి వచ్చింది. అయినా ఆయా అసెస్‌మెంట్లు వేసిన అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్కడి నుంచి మొదలైన దొంగ అసెస్‌మెంట్ వ్యవహారాలు కోకొల్లలుగా వెలుగులోకి వచ్చాయి. ఏకంగా ప్రభుత్వ భూములకు సైతం దొంగ అసెస్‌మెంట్లు వేసిన అంశం వెలుగులోకి రావడంతో బిల్ కలెక్టర్ల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఆ కేసుకు సంబంధించి నేటివరకు ఎలాంటి శాఖాపరమైన విచారణ నిర్వహించలేదు. అంతేకాకుండా జీవో-59 ప్రకారం జరిగిన అక్రమ క్రమబద్ధీకరణ అంశంలో ఓ బీఆర్ఎస్ నేతకు సంబంధించి క్రమబద్ధీకరణలో పొందుపర్చిన అసెస్‌మెంట్ సర్టిఫికెట్‌లో ఎన్నెస్పీ క్యాంపులో అసలు నిర్మాణమే లేని పాత ఇంటి నెంబర్‌ను రెన్యువల్ చేసినట్టుగా తెలింది. దానికి సంబంధించి కూడా సంబంధిత సెక్షన్ అధికారులపై చర్యలు లేవు. ఆ కారణంగానే అక్రమాలు చేసినా తమకు పెద్ద ఇబ్బందులేవీ ఉండవన్న ధీమా సంబంధిత అధికారుల్లో ఉండడంతో ఆ విభాగానికి కొత్తగా వచ్చిన అధికారులు సైతం పాత పద్ధతినే వెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా అంశాలకు సంబంధించిన వ్యవహారాలపై విచారణ పూర్తి చేయాలని, ఆ విభాగానికి కొత్తగా వచ్చిన అధికారులు చేసిన అక్రమాలపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గత సర్కార్‌లో సాగులో లేని భూములకూ రైతుబంధు

(5వ పేజీ తరువాయి)

ప్రజలు ఎన్నుకున్నారన్నారు. అధికారానికి అలవాటుపడిన బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో ఉండలేక అవాకులు చవాకులు పేలుతున్నారని ఘటుగా వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, వ్యవసాయయాంత్రీకరణ వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండదండగా నిలుస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో మొదటి ఏడాదిలోనే రైతుల సంక్షేమానికి రూ.27వేల కోట్లు చెల్లించామన్నారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500బోనస్‌తో ఎకరానికి రూ.8వేల నుంచి రూ.10వేల ప్రోత్సాహకం అందుతుందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామన్నారు. డిసెంబర్ 9 నాటికి రైతురుణమాఫీ పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్ పాలుపు విజయవెంకటరమణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కృషి

» ముఖ్యమంత్రి సహకారంతో త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తా
» గ్రానైట్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషిచేస్తా
» గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోషియేషన్ ప్రమాణస్వీకారంలో మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమ మనుగడకు, పరిశ్రమ పూర్వవైభవానికి సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమయం తీసుకొని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాక శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ప్యాక్టరీ ఓనర్స్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. గతంలో తాను తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు, బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు గ్రానైట్ పరిశ్రమల సమస్యలను పరిష్కరించానని అన్నారు. రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి నామా నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, తన రాజకీయ ఎదుగుదలకు ముఖ్యకారణం గ్రానైట్ పరిశ్రమే అని అన్నారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉండటం మన అదృష్టం అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, వయవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మనకుండటంతో సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని అనుకుంటున్నానని అన్నారు. గ్రానైట్ సమస్యలైన సబ్సిడీలు, రాయల్టీలో 40 శాతం రాయల్టీ, క్వారీల సరళీకృతం అంశాలు పెద్దవి కానప్పటికి రాష్ట్రం ప్రభుత్వం దృష్టిపెడితే వెంటనే పరిష్కారం అవుతాయని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, తంబూరు దయాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సాదు రమేష్‌రెడ్డి, అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ హాజరై మాట్లాడారు. 2009 నుంచి అప్పటి ప్రభుత్వాలు గ్రానైట్ పరిశ్రమకు కావాల్సిన 40 శాతం రాయల్టీ పై రాయితీ అందించాయని, ప్రస్తుతం 2024 జనవరితో ముగిసిపోయిందని, పరిశ్రమకు రావాల్సిన రూ. 20 కోట్ల సబ్సిడీ డబ్బులు, 40 శాతం రాయల్టీపై రాయితీ, క్వారీ లీజుల సరళీకృతం చేసి పరిశ్రను ఆదుకోవాలన్నారు. ముందుగా నూతనంగా ఎన్నికైన అసోషియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్, ప్రధాన కార్యదర్శి కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు తమ్మినేని సాగర్, సంయుక్త కార్యదర్శి షేక్ రియాజ్, కార్యవర్గ సభ్యులు దొండేటి స్వేదన్, పెరుమళ్లతపల్లి రవికుమార్‌తో ఎన్నికల అధికారి నేరళ్ల శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించి ఎన్నికైనట్టు పత్రాలను అందించారు. అనంతరం మంత్రి తుమ్మలను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, యలమద్ది శ్రీనివాసరావు, టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తెడ్డు రమేష్, కోశాధికారి కృష్ణారెడ్డి, స్లాబ్ అసోసియేషన్ మాజీ కోశాధికారి రాకేష్, గ్రానైట్ పరిశ్రల యజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల


నియామక పత్రం అందుకుంటున్న యుగంధర్

క్రైం సమాచారం

బాణాసంచా పేలి బాలుడికి తీవ్ర గాయాలు

» రావణ దహనం రోజు పేలకుండా మిగిలిఉన్న టాపాసులు పేలుస్తుండగా ఘటన

» డబ్బులు లేక వైద్యానికి దూరంగా విద్యార్థి కుటుంబం



గాయపడిన గౌతమ్

చర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): టపాసు కాలుస్తుండగా చేతిలో పేలి సోయం గౌతమ్ అనే గిరిజన బాలుడి చేతికి తీవ్రగాయమైన ఘటన చర్ల మడంలం పాతచర్లలో చోటు చేసుకుంది. కాగా ఈ విషయం కాస్తా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దసరా పండుగ సందర్భంగా పాత చర్ల శివాలయంలో ఎదరుగా ఆలయ నిర్వాహకులు రావన దహనం కార్యక్రమం నిర్వహించారు. భారీగా టపాసులు పేల్చారు. కాగా రెండు రోజుల తరువాత దహనం కార్యక్రమం నిర్వహించిన చోట చిన్నారులు ఆటలు ఆడుకున్నారు. ఇదే క్రమంలో ఆరవ తరగతి చదువుకుంటున్న గౌతమ్ చిన్నారికి, మరో బాలుడుకు టాపాసులు దోరికాయి. దీంతో వాటిని పేల్చే ప్రయత్నిం చేశారు. ఒక్కసారిగా అవి చేతిలో పేలడంతో గౌతమ్ చేతికి వేళ్లకు తీవ్రగాయమైంది. ప్రస్తుతం చిన్నారి చర్ల ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యం పొందుతున్నాడు. కాగా చేతికి తీవ్రంగా గాయమైందని వైద్యులు హైదరాబాద్ తీసుకుని వెళ్లాలి అని చెబుతున్నారని బాలుడు తండ్రి సోయం రాజారావు తెలిపాడు. అలాగే టపాసులు కాల్చిన తరువాత చాలా పేలకుండా ఉన్నాయని వాటిని తొలగించక పోవడంతోనే ఈ ఘటన జరిగిందని వాపోయాడు. పాఠశాల పక్కనే ఉందని శ్రద్ధ తీసుకుని ఉంటే ఇలా జరిగేది కాదని, చేతిలో నగదు లేక వైద్యం కూడా చేపించ లేక పోతున్నా అని బాలుడు తండ్రి విలపించాడు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి

కూసుమంచి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కౌలురైతు కిన్నెర శ్రీను (40)ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం శ్రీను కంచాని గుర్వయ్య పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురయి బావిలో పడ్డాడు. వెంటనే పరిసర రైతులు గమనించి బయటకు తీసేలోగా మృతిచెందాడు. మృతుడి భార్య కిన్నెర లక్ష్మి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం నేలకొండపల్లి తరలించినట్లు పోలీసులకు తెలిపారు.

పిడుగుపాటుకు గురైన మహిళ..

తిరుమలాయపాలెం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడుతండాలో పిడుగుపాటు తాకిడికి శనివారం గురై ముగ్గరు మహిళలు అస్వస్థతకు గురికాగా వారిలో భూక్యా శారద(38) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. బచ్చోడుతండాకు చెందిన భూక్యా శారద తన ఇద్దరు పిల్లలు మరో మహిళతో తమ పొలంలో పనులు చేస్తున్నారు. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములతో వర్షం కురిసింది. అలాగే భారీశబ్దంతో పిడుగుపడిన శబ్దం వినపడడంతో వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 108 ద్వారా ఖమ్మంప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శారద మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. శారద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో రైతుకు గాయాలు

బోనకల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతు మడుపల్లి నాగేశ్వరావు ఆదివారం పొలం పనులకు వెళ్లాడు.

వర్షం రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి చెట్టు కిందకు వచ్చాడు. దగ్గరలో పిడుగు పడటంతో గాయాలయ్యాయి. అతడిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన పిడుగు ప్రమాదం

వైరా(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపనేనిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపాటు నుంచి ఓ కుటుంబం సురక్షితంగా బయటపడింది. శీలం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ఆవరణంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. అయితే ఆసమయంలో చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులంతా ఇంట్లో ఉండటంతో పెను ప్రమాదం తప్పిపోయింది. కొబ్బరిచెట్టుపై భాగంలో మంటలు వ్యాపించాయి. అదే సమయంలో వర్షం కురవడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

సాగర్ కాల్వలో దూకిన మహిళ

కాపాడిన స్థానికులు

నేలకొండపల్లి, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తకొత్తూరు వద్ద సాగర్ కాల్వ లోకి దూకి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన స్థానికులు ఆ మహిళను కాపాడారు. వివరాల ప్రకారం బచ్చలకూరి ప్రియాంక ఆదివారం సాయంత్రం కొత్తకొత్తూరు వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి సాగర్ కాల్వలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్పాడింది. ప్రియాంక కాల్వలోకి దూకటాన్ని గమనించిన అక్కడే ఉన్న స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి ప్రియాంకను బయటకు తీసారు. అనంతరం 108 ద్వారా నేలకొండపల్లిలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రియాంక ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

వీడిన మహిళ హత్యకేసు మిస్టరీ

» భర్తే మూడో భార్యతో కలిసి హతమార్చిన వైనం

» అరెస్టు భయంతో లొంగిపోయిన నిందితులు: వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ రఘు

కల్లూరు, అక్టోబరు 20: ఖమ్మం జిల్లా కల్లూరు పరిసర ప్రాంతంలో ఇటీవల జరిగిన ఓ మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించా రు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను క ల్లూరు ఏసీపీ రఘు ఆదివారం తెలిపారు. కల్లూరు ప్రాంతంలోని పుల్లప్పకుంట చెరువులో ఇటీవల ఓ మహిళ అస్తిపంజరం గుర్తించడంతో పోలీసులు దాన్ని వెలికితీసి ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసును విచారించగా హత్యగా తేలింది. పోలీసుల దర్యాప్తులో గుర్తించిన వివరాల ప్రకారం.. కల్లూరు మండలం రాళ్లబంజరు గ్రామానికి చెందిన భూక్యా ప్రసాద్‌కు పాయాపూరు గ్రామానికి చెందిన కళ్యాణితో 20 సంత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే పదేళ్ల క్రితం అతడు ఆమెను వదిలేసి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో నాలుగు సంత్సరాల క్రితం విద్యుత్ పని నిమిత్తం ప్రసాద్ కొత్తగూడెం వెళ్లగా అక్కడ నరసమ్మ అనే మహిళతో పరిచయం ఏర్పడటంతో ఆమెను తన ఇంటికి తీసుకొచ్చి వివాహం చేసుకొన్నాడు. ఈ క్రమంలో మళ్లీ కరెంటు పని నిమిత్తం ఏడాది క్రితం ప్రసాద్ నెల్లూరు వెళ్లగా అక్కడ చెల్లాయపాలెం గ్రామానికి చెందిన మరో మహిళ మల్లీశ్వరితో పరిచయం ఏర్పడగా ఆమెను కూడా ప్రసాద్ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నరసమ్మ ప్రసాద్‌తో గొడవ పడింది. మల్లీశ్వరిని వదిలేయాలని లేదంటే గ్రామంలో పెద్దలకు చెప్పి పంచాయితీ పెట్టి పరువు తీస్తానని బెదిరించింది. ఈ వ్యవహారంపై కల్లూరు పోలీసుస్టేషన్లో నరసమ్మ ఫిర్యాదు కూడా చేసింది. దీంతో మల్లీశ్వరి, ప్రసాద్‌లు భయపడి తమని నరసమ్మ కలిసి ఉండన్విదనే ఉద్దేశంతో ఆమెను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొని పథకం వేశారు. పథకంలో భాగంగా గత నెల 29న ప్రసాద్, మల్లీశ్వరిలు కల్లూరుకు వచ్చి నరసమ్మను చంపేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. కల్లూరు నుంచి రాళ్లబంజరు వెళ్లే రహదారి వైపు గల ఓ మామిడి తోటలో ముందుగానే మల్లీశ్వరి దాగి ఉండగా అనంతరం ప్రసాద్ నరసమ్మకు ఫోన్ చేసి ఇక మీదట మనం కలిసి ఉందామని, కల్లూరుకు రావాలని మాయమాటలు చెప్పాడు. అతడి మాటలు నమ్మి వచ్చిన నరసమ్మను ముందుగు వేసుకున్న పథకం ప్రకారం 29వ తేదీ సాయంత్రం రాళ్లబంజరు రహదారి వైపున గల మామిడి తోటలోకి తీసుకెళ్లి ప్రసాద్ ఆమె కణతపై కొట్టడంతో కిందపడిపోయింది. తరువాత మల్లీశ్వరి ఓ చీరతో నరసమ్మకు ఉరివేయగా ఇద్దరు కలిసి చీరను గట్టిగా లాగి చంపేశారు. ఆ తరువాత మృతదేహాన్ని మామిడితోట పక్కన గల పుల్లప్పకుంట చెరువులో పడేశారు. ఈ నెల 15న తేదీన పుల్లప్పకుంట చెరువులో గుర్తుతెలియని మహిళా మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి రాళ్లబంజరు గ్రామంలో విచారణ చేయగా భూక్యా ప్రసాద్‌తో సహజీవనం చేస్తున్న నరసమ్మ కనిపించడం లేదని తమ విచారణలో తేలింది. దీంతో పోలీసులు భూక్యా ప్రసాద్ ఇంటికి వెళ్లగా అతడు కనిపించలేదు. ఈ కేసు విషయమై ప్రసాద్‌ను పోలీసుస్టేషన్‌కు రమ్మని తాము కోరినా అతడు రాలేదని ఏసీపీ తెలిపారు. ఇలా పలుమార్లు పోలీసులు ఇంటికి వెళ్లగా భయపడ్డ ప్రసాద్, మల్లీశ్వరిలు ఎట్టకేలకు పోలీసుస్టేషన్‌కు వచ్చి జరిగిన విషయం చెప్పి లొంగిపోయారన్నారు. దీంతో వారిద్దరని ఆదివారం అరెసుట్ల చేసి సత్తుపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ రఘు విలేకరులకు తెలిపారు. సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ఎం లింగయ్య, ఎస్ఐ ఎస్‌కే. షాకీర్‌లు పాల్గొన్నారు.

మీ సేవలకు సెల్యూట్

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

ఖమ్మంక్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అంటే ఆ పేరులో ఒక గంభీరం.. వారంటే ప్రతి ఒక్కరికి తెలియని భయం, ధైర్యం, అండ అని ఉంటుంది. ప్రపంచం అంతా నిద్రపోతున్న కూడా మేల్కోనే ఉండి విధులలో పోరాడేది పోలీసులు ఒక్కరే.. పోలీస్ అంటే పట్టుదల, ఓర్పు, సహనం, శాంతిభద్రతలకు వారు చేసే కృషి మనం ఎన్నటికి మరువలేనిది.. ఎండ వాన పగలు రాత్రి తేడా ఉండదు.. నిత్యం ప్రజల కోసం విధులలో ఉంటారు. ఇతర ఉద్యోగులకు రోజువారి పని వేళలో కొద్ది గంటలు మాత్రమే ఉంటుంది కానీ పోలీసులకు మాత్రం 24 గంటలు ఉద్యోగం ఉంటుంది. మనం ఎలాంటి పరిస్థితులలో ఉన్న మొదట మనకు గుర్తు వచ్చేది పోలీసులే. సామాన్యుల నుంచి సంపన్నుడి వరకు అపదలో ఉన్న పోలీసులే అండగా ఉంటారు. బందోబస్తు విధులలో సిబ్బంది విరామం లేకుండి విధులు నిర్వహిస్తారు. ఇప్పుడున్న పరిస్థితులలో సిబ్బంది కొరత ఉండటంతో కనీసం సెలవులు కూడా దొరకని పరిస్థితి. అయినా కూడా వెనకడుగు వేయకుండా విధులలో ముందుకు పోతుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే అసలు పోలీసు వ్యవస్థ అనేది లేకపోతే ప్రజలకు అండ అనేది ఉండదు. అంతేందుకు గతంలో కరోనా కష్టకాలంలో వారు విధులు, చేసిన సేవలు మనం ఎప్పటికి మరువలేనివి. ఇటివలె జరిగిన ఎన్నికలలో వినాయక నిమజ్జన వేడుకలలో విధులకు వారికి సాటి లేరు అన్న విధంగా విధులు నిర్వహించారు. అందరు ఇళ్లలో కుటుంబాలతో ఉంటే పోలీసులు మాత్రం రోడ్లపై ఉంటు రోడ్లపై పడుకుంటు ఇంటికి కూడా వెళ్లకుండా విధులు నిర్వహించారు. మనం అంతా పండుగలు వేడుకలు జరుపుకుంటున్నా వారికి మాత్రం ఎలాంటివి ఉండవు. వారు చేసేది ఉద్యోగం మాత్రమే కాదు.. సేవ అని చెప్పుకోవాలి.

శాంతి భద్రతలు పరిరక్షించే క్రమంలో కొందరు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు. అలా అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుతుంటారు. అంతే కాకుండా పోలీసు శాఖ ఆద్వర్యంలో జిల్లాలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించి విద్యార్థులకు క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించి ఇప్పుడున్న పోలీసులపై వారి సేవలపై అవగాహన కల్పిస్తుంటారు.

అమరవీరుల దినోత్సవం ఎందుకు జరుపుకుంటారు..

పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకునేందుకు ఒక గొప్ప చరిత్ర ఉందని చెప్పాలి. సరిహద్దు భద్రతదళం, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి బలగాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్సు (సీఆర్‌పీఎఫ్) బలగాలు నిర్వర్తించేవి. 1959వ సంవత్సరం అక్టోబరు 21 న అంటే 65 ఏళ్ల కిందట డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21మంది సీఆర్‌పీఎఫ్ బృందం దేశభద్రతకోసం భారత్-చైనా సరిహద్దులలో ఉన్న లడక్ అక్సాయ్‌చిన్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో చైనా సైనికులు సీయాచిన్ భూబాగాన్ని ఆక్రమించేందుకు భారత భూభాగంలోకి భారీ సంఖ్యలో చొరబడి ఒక్కసారిగా సీఆర్‌పీఎఫ్ జవాన్లపై విరుచుకుపడ్డారు. సీఆర్‌పీఎఫ్ జవాన్ల చాలా తక్కువ మంది ఉన్నప్పటికి కూడా తుదిశ్వాస వరకు చైనా సైనికులతో పోరాడి దేశం కోసం 10మంది జవాన్లు అశువులు బాపారు. దేశం కోసం పోలీసులు ప్రాణాలు విడిచిన తొలిఘటన ఇదే కావడంతో 1960 జనవరి9న దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు సమావేశమై ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరపాలని నిర్ణయించా రు. అప్పటి నుంచి అక్టోబరు21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంను జరుపుతున్నారు.



21నుంచి 31వరకు

ప్రత్యేక కార్యక్రమాలు

పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ప్రతి ఏటా 21 నుంచి సర్దార్ వల్లబాయి పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం 31 వరకు పలు కార్యక్రమాలు పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారు. దీనిలో బాగంగా వ్యాసరచన పోటీలు, లఘుచిత్రాల పోటీలు, రక్తదాన శిభిరాలు, ఫొటోగ్రఫి పోటీలు నిర్వహించనున్నారు. ఈపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందజేయనున్నారు. అదేవిధంగా సోమవారం నగరంలోని పోలీస్ పరెడ్ మైదానంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల దినోత్సవం వేడుకలు నిర్వహించనున్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను పోలీసు అధికారులు సన్మానించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో అమరులు వీరే..

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 22మంది పోలీసులు అమరులయ్యారు. వీరిలో ఒక ఆర్ఐ, ముగ్గురు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 14మందికానిస్టేబుళ్లు ఉన్నారు

●1991 మే21న బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ పరిదిలో ఫైరింగ్ జరగడంతో ఒక ఆర్ఐ మృతి చెందారు.

●1992 అక్టోబరు 27న డొంకరాయి గ్రామంలో జరిగిన బ్లాస్టింగ్‌లో ఒక ఎస్ఐ, ఒక హెచ్‌సీ, మరో ఇద్దరు పోలీసులు అమరులయ్యారు.

●1997 జనవరి 10న కరకగూడెంలో జరిగిన మావోయిస్టు కాల్పుల్లో ఏడుగురు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అతి పెద్ద సంఘటన

●1997 మే21న పాల్వంచలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఎస్ఐ మృతి చెందారు.

●1998 మార్చి29 న ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు కానిస్టేబుళ్ళు మృతి చెందారు.

●1998 జూలై28న మహబూబాద్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఏఎస్ఐ మృతి చెందారు.

●1999 ఫిబ్రవరి24న కొత్తగూడెంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఏఎస్ఐ మృతి చెందారు.

●2001 జనవరి12న తూర్పుగోదావరి జిల్లా ఎట్టిగూడెంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు కానిస్టేబుళ్లు మృతి చెందారు.

●2002 డిసెంబరు14న చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నక్సలైట్లు పెట్టిన కరెంటు షాకుతో ఒక కానిస్టేబుల్ మృతి చెందారు.

●2005 జూలై13న భద్రాచలంలో నక్సల్స్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఎస్ఐ మృతి చెందారు.

కార్మిక సంఘాల పునరుద్ధరణ కోసమే
టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం

» ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి రామయ్య



విలీన సభలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలు ఏడు దశాబ్దాలు పాటు అనేక ఉద్యమాలు, కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 26 జాతీయ కార్మిక చట్టాను బీజేపీ ప్రభుత్వంలో ఒక్క కలం పోటుతో రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోర్డులను తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కొల్పోయేలా చేసిందని, జాతీయ స్థాయిలో బలమైన కార్మిక ఉద్యమాల కోసమే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం జరుగుతుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామయ్య మాట్లాడారు. సంక్షేమ పథకాల కార్మికులు, ఆసంఘటిత కార్మికుల సమస్యలకు శాశ్విత పరిష్కారం కావాలంటే జాతీయ స్థాయిలో ఉద్యమాలు జరగాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. టీయూసీఐని దేశ వ్యాప్తంగా బలమైన కార్మిక సంఘంగా ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలీన సభలోను రామయ్య ప్రసంగించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక ఉద్యమాలను వివరించారు.

పేదలకు న్యాయం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం

» ఖమ్మంలో తన ఇంటిని కాపాడాలని మంత్రి తుమ్మలకు వృద్ధురాలు గోడు

» న్యాయం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు మంత్రి ఆదేశం



మంత్రి తుమ్మలకు తన గోడు చెప్పుకుంటున్న వృద్ధురాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు న్యాయం చేసేందుకు వారి కష్టాలను తెలుసుకొని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తొందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు మెల్లెంపూడి రాజ్యలక్ష్మీ మంత్రి తుమ్మలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తన గోడు తెలిపారు. తాము 1976 నుంచి నివాసం ఉంటున్న ఇళ్లను సమీపంలోని వ్యక్తి అడ్డుకుంటున్నారని, మున్సిపల్ కార్యాలయంలో అధికారులను ప్రభావితం చేసి తమ ఇంటికి పర్మిషన్ రాకుం డా చేస్తున్నారని మంత్రి తుమ్మలకు సమస్యను వివరించారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు నివాసాలు ఉంటున్న ఇళ్లను కూల్చటం ఉండదన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సర్వే నిర్వహించి ఫిర్యాదుదారిరాలుకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

జర్నలిస్టుపై దాడికేసులో ముగ్గురి అరెస్టు

ఇల్లెందు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందులోని ఓ పత్రికలో జర్నలిస్టుగా పని చేస్తున్న నిట్టా సుదర్శన్‌పై గురువారం రాత్రి జరిగిన దాడి సంఘటనలో ముగ్గుర్ని ఆదివారం ఇల్లెందు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జర్నలిస్టు సుదర్శన్‌పై అకారణంగా వ్యక్తిగత కక్షలతో మండల పరిధిలోని జగదాంబగుంపు వద్ద రాత్రి సమయంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సుభాష్‌నగర్‌కు చెందిన వంశీ, ప్రేమ్, ఉద య్ వ్యక్తిని ఇల్లెందు పోలీసులు అరెస్టు చేశారు. జర్నలిస్టుపై దాడిచేసిన వీడియో వైరల్‌కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంఘటన సంచలనమైంది. పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. సుదర్శన్ జగదాంబగుంపువద్ద వేచి ఉండగా అతనిపై దాడిచేసి తీవ్రంగా కొట్టడంతో గాయాలు కాగా సమాచారం అందుకున్న ఇల్లెందు సీఐ సత్యనారాయణ హుటాహుటీన తరలివెళ్లి ఇల్లెందు ప్రభుత్వఆసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ సంఘటనలో మిగిలి ఉన్న మరికొంత మంది కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

3న సకల ఉద్యోగుల సమరాధన

» జేఏసీ సెక్రటేరీ జనరల్ ఏలూరి



మాట్లాడుతున్న జేఏసీ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 'నవంబరు 3న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని' టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సకల ఉద్యోగుల సమ్మేళనం ప్రాధాన్యతను వివరించారు. ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక సకల ఉద్యోగుల సమ్మేళనంలో ప్రస్తుతం జరుగుతున్న కుల, మత వనబోజనాలకు అతీతంగా కుల, మత, ఉన్నత, కింద స్థాయి ఉద్యోగులనే తారతమ్యం లేకుండా ఐక్యంగా కలిసి మెలిసి జరుపనున్నట్లు తెలిపారు. వనబోజనాల కార్యక్రమంతో పాటుగా రాష్ట్ర స్థాయిలో పేరున్న కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విభాగాల్లో పలురకాల క్రీడా పోటీలు మహిళలు, పురుషులకు విడివిడిగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లాల నుంచి జేఏసీ నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఇదే కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమారాధన ద్వారా ఉద్యోగుల ఐక్యత కనపరచాలని కోరారు. త్వరలో ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్సీ, ఇతర సమస్యల పరిష్కారం కోసం జిల్లా మంత్రుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు తెలిపారు. ఏడేళ్ల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఉద్యోగులంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కొణిదెన శ్రీనివాస్, జయపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, కాస్తాల సత్యనారాయణ, ఎం వేలాద్రి, మల్లెల రవీంద్ర ప్రసాద్, రాజేష్, కొమరగిరి దుర్గాప్రసాద్, చంద్రకాని రమణ యాదవ్, శ్రీధర్ సింగ్, బుసా చంద్రశేఖర్, గంగవరపు బాలకృష్ణ, వల్లపు వెంకన్న, ఎర్రా రమేష్, పి నాగేశ్వరరావు, డాక్టర్ రత్నాకర్, దేవరకొండ సైదులు, మట్టా శ్రీను, కె కృష్ణారావు, విజయ్, శ్రీనివాసరావు, ఏలూరి కొనార్, తాళ్లూరి శ్రీకాంత్, సగ్గుర్తి ప్రకాష్, జంగం లక్ష్మణరావు, పెద్దినేని రాధాకృష్ణ, రవిచంద్ర, ఆంజనేయులు, బిక్కునాయక్, వెంటేశ్వర్లు, వేణు, లలిత కుమారి, వీణా కుమారి, సుమమాలిని, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

కల్లోజికి ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ అల్లం పరామర్శ



నివాళులర్పిస్తున్న ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, జర్నలిస్టు నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ కల్లోజి శ్రీనివాస్‌ను టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ ఆదివారం రాత్రి పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి జయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో హేమచంద్రాపురంలోని స్వగ్రామానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్, కోశాధికారి హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్ యోగి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చంద్ర నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ షఫీ, టెంజూ అధ్యక్షుడు వట్టికొండ రవి, క్రాంత్‌కుమార్, సీమకుర్తి రామకృష్ణ, అశోక్, శ్యామ్, పురుషోత్తం, చింతల చిరంజీవి, మొగిలి, డాక్టర్ తరున్, ప్రేమ్ సాగర్, సాయిచరణ్ పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు20: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో ప్రతీ మాల కుటుంబాన్ని కలిసి ఎస్సీ వర్గీకరణపై ప్రచారం చేయాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగర అధ్యక్షుడు తురక నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం మల్లయ్యతో కలిసి నగర కమిటీ సమావేశం నిర్వహించారు. కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కరపత్రాలను ప్రతీ మాల కుటుంబ సభ్యులకు అందించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు జరిగే అన్యాయాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టె సుధాకర్, గుమ్మడి కనకరాజు, తలారి రాధాకృష్ణ , తొగరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేరు ఎలా వచ్చిందంటే ?

ఖమ్మం చార్మినార్.. రాతిధర్వాజా



ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): వీధులు పట్టణ, నగరాలకు ప్రత్యేకతను కలిగిస్తాయి.. వీధులకు పెట్టే పేర్లు సైతం స్థానిక అంశాలతో ముడిపడి ఉంటాయి.. అదేతరహాలో ఏర్పాటయ్యింది.. ఖమ్మంలోని రాతి దర్వాజా ప్రాంతం.. పురాతన ఖమ్మం ప్రాంతంలోని ఈ వీధి పలు వీధులను కలిపే కూడలిగా ఉంది. స్థానికంగా ముస్లింలు అధికంగా ఉన్నప్పటికీ ఈవీధిని ఆనుకొని ఉన్న అనేక ప్రాంతాల్లో హిందువులు, క్రైస్తవులు అధికంగా ఉన్నారు. ఫలితంగా భిన్నమతాల సామరస్య కేంద్రంగా గుర్తింపు తెచ్చుకుంది.

ఇరవై అడుగుల ఎత్తున రెండువైపులా ఏకశిలలు

నిజాంపేట, జమ్మిబండ బజార్, చెరువు బజార్, తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్డు కూడలిగా ఉన్న ఈ ప్రాంతం ఖమ్మానికి ప్రత్యేకతగా మారింది. రోడ్డుకు రెండు వైపులా పెద్ద పెద్ద బండరాళ్లను ఏర్పాటు చేసి వాటిని ధర్వాజాగా మార్చటం ఈకట్టడం ప్రత్యేకత.. నిలువెత్తుగా దర్జా ఒలకబోస్తూ అలనాటి ఖ్యాతికి నిండు దర్పణంగా విలసిల్లుతోంది.. ఇరవై అడుగుల ఎత్తున రెండువైపులా ఏకశిలలు, వాటిపై అడ్డంగా పదిహేను అడుగులకు పైగా మరొక శిలను అమర్చి ప్రవేశ ద్వారంగా మార్చారు. ఈ దారి గుండానే స్థానికుల రాక పోకలతోపాటు అనేక ప్రాంతాలను కలిపే కూడలిగా వెలుగొందుతోంది. చార్మినార్ హైదరాబాద్‌కు ల్యాండ్‌మార్క్ ఎలాగో.. రాతిధర్వాజా ఖమ్మానికి అతరహా పురాతన, చారిత్రాత్మక ల్యాండ్ మార్క్‌గా నిలుస్తోంది. చార్మినార్ లోపలి నుంచి గతంలో వాహనాల రాక పోకలు సాగేవి.. అదేతరహాలో ఖమ్మంలోని ఈ కట్టడం నుంచి కూడా రాకపోకలు ఇప్పటికీ సాగుతుంటాయి. ఖమ్మంలోని రాతిధర్వాజా పేరు వినగానే అలనాటి రాజుల పాలన, ఖిల్లా తదితర అంశాలు గుర్తొస్తాయి.

ఖిల్లాలోనికి ప్రవేశించేందుకు వీలుగా

చారిత్రక ఖమ్మం ఖిల్లాలోనికి ప్రవేశించేందుకు వీలుగా తూర్పువైపున ద్వారంగా ఈ కట్టడాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మం పట్టణం సైతం ఈ ప్రాంతంలోపలే మొదటగా ఏర్పాటై ఉండటంతో ఆరోజుల్లో ఈ ద్వారా ఊరిలోకి ప్రవేశ మార్గంగా కూడా ఉంది. నిజాం నవాబు పాలన కాలంలో ఈ రాతిధర్వాజను ఏర్పాటు చేశారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తదనంతర కాలంలో ఈ మార్గం నుంచే ఇతర ప్రాంతాలకు రాకపోకలుసైతం మొదలై నేటికీ కొనసాగుతున్నాయి. ఈధర్వాజాకు అమ్మవార్లను ప్రతిష్ఠించి స్థానిక హిందువులు పూజలు చేస్తుండటం గమనార్హం..

ముప్పేటా.. వరద ముంపే!

డివిజన్ విజిట్

- డ్రెయిన్ల వ్యవస్థను బాగుచేసేదెవరు?
- నిండా మునిగిపోతున్న మోతీనగర్
- తటాకాల్లా ఖాళీ స్థలాలు
- దోమల రొద... కునుకులేక వ్యథ





మోతీనగర్ సింబాలిక్ చిత్రం, మురుగుతటాకం

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): భారీవర్షం కురిసిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి... నగరానికి శివారు ప్రాంతంలో ఉండి కార్పొరేషన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నా... కనీస సౌకర్యాలు లేక 35వ డివిజన్ వాసులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వరదకు 14 అడుగుల వరద నీరు ఈ కాలనీలను ముంచెత్తింది. ఫలితంగా కష్టాన్ని మోతీనగర్, హనుమాన్‌నగర్, డాబాల బజార్ కాలనీ వాసులకు మిగిల్చింది. నగరంలోని వచ్చే మురుగు నీళ్లు... వర్షపు నీళ్లు... గోళ్లపాడు చానెల్ నుంచి వచ్చే వరదతో పాటు మున్నేరు నుంచి వచ్చే వరద మొత్తం ముప్పేటా దాడి చేస్తున్నాయి. దీంతో ఈ డివిజన్ ప్రజలు ఏటా వర్షాకాలంలో కోలుకోలేక పోతున్నారు. వర్షాలు వస్తున్నాయంటే ఇళ్లలో సామాన్లు సర్దుకుని బిక్కుబిక్కుమంటూ గ డపాల్సిన దుస్థితి. అంతే కాదు సాయంత్రం అవుతుందంటే చాలు.. దోమల రొద... రాత్రయ్యిందంటే కునుకులేక వ్యథ అనుభవిస్తున్నామంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పగలు మురుగు కంపుతో.. రాత్రిళ్లు దోమల స్వైరవిహారంతో కంటిమీద కునుకులేకుండా జీవిస్తున్నారు.

సమస్యలు ఇలా..

● పాకబండ బజార్ నుంచి వైరా రోడ్డు మీదుగా, పాత మునిసిపల్ కార్యాలయం నుంచి కమాన్‌బజార్ మీదుగా రైల్వే స్టేషన్ , గాంధీచౌక్ నుంచి డాబాల బజార్ మీదుగా మోతీనగర్ నుంచి మున్నేరులో మురుగు నీటి కాలువలు కలుస్తున్నాయి. వీటికి సరైన డిజైన్ లేకపోవడం.. పాత కాలంనాటి డ్రెయిన్ల కారణంగా చిన్నపాటి వరదకే వీధులన్నీ మురుగు నీటితో నిండిపోతున్నాయి. అంతే కాదు మురుగు రోజుల తరబడి ఉంటూ ఇక్కడి వాసులకు అనారోగ్యాన్ని పంచుతున్నాయి. ఈ మురుగు కారణంగా డాబాల బజార్‌కు బురదరాఘవ పురం పేరుగా నామకరణం అయ్యిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

● అంతేకాదు మున్నేరులో కలిసే కాలువ ఏటా మున్నేరుకు వరదలు వచ్చిన సమయంలో నీళ్లన్నీ ఎదురు వచ్చి ఈ కాలనీలను ముంచెత్తుతున్నాయి.

● హిందూ స్మశాన వాటిక, ఇక్కడే వక్ఫ్ బోర్డు భూముల్లో ఖబరస్థాన్ కూడా ఉంది. ఈ రెండిటి వలన ఇక్కడి ప్రజలకు మృతదేహాలను కాలుస్తున్నప్పుడు , పూడ్చిన తర్వాత వాసన, పొగ మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయి. హైదరాబాద్ స్థాయిలో ఇక్కడ విద్యుత్‌తో దహనం చేసే విధానాన్ని అమలు చేయాల్సి ఉంది.

● మున్నేరు పక్కనే బఫర్ జోన్లలో అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ అంతా నిరుపేదలే ఆవాసం ఉంటున్నారు. వీరికి ఇబ్బంది కలిగించకుండా ఉండాలని వేడుకుంటున్నారు.

● సాయికృష్ణ నగర్, వాసవి గార్డెన్ నుంచి ఇండియన్ గ్యాస్ గోదాము వరకు , కనీసం మూడు నుంచి నాలుగు రోడ్లు ఇంకా మట్టి రోడ్లే ఉన్నాయి. కనీసం 3 నుంచి 4 కిలోమీటర్ల మేర మట్టి రోడ్లు ఉండడంతో కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు.

● సాయికృష్ణ నగర్‌లో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలంటే స్థంబాలు లేకపోవడంతో కరెంట్ కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ నిర్మిస్తున్న ఇళ్లకు కరెంట్ సౌకర్యానికి స్థంబాలు వేయాల్సి ఉంది.

● ఇంత పెద్దడివిజన్‌కు రెండు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మరోకటి ఉంటే పిల్లలకు అనుకూలంగా ఉంటుంది.

35వ డివిజన్ ముఖచిత్రం

జనాభా : 9786
ఓటర్లు : 4,673
కాలనీలు : భక్తపోతన వీధి, కాళిదాస్‌వీధి, పొట్టిశ్రీరాములు రోడ్డు, ట్రంక్‌రోడ్డు, డాబాలబజార్, మోతీనగర్, కృష్ణసాయినగర్, హనుమాన్ వీధి..
అంగన్‌వాడీలు: రెండు
రేషన్ దుకాణం: ఒకటి



మురుగు నీరంతా వచ్చేది ఈ కాలువ ద్వారానే

డివిజన్ సమస్యలను పట్టించుకోవాలి

రామ్మోహన్‌రావు, మోతీనగర్



నగరంలోనే పెద్ద డివిజన్ ఇది. ఇక్కడ వరదనీళ్లు రాకుండా శాశ్వత పరిష్కారాన్ని చూపాలి. చిన్నపాటి వరదలకే కాలనీలు ముంచెత్తుతున్నాయి. ఏటా కోట్లలో నష్టపోతున్నారు. అంతేకాదు డివిజన్‌లో పారిశుధ్యం, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

వరద నీరు నిల్వ ఉండకుండా చేయాలి

శివారెడ్డి, కాలనీవాసి



నగరంలోని వరద నీళ్లన్నీ మోతీనగర్‌లో నిలుస్తున్నాయి. దీని వలన తటాకాల్లా ఖాళీప్రదేశాలు దర్శనం ఇస్తున్నాయి. ఫలితంగా దోమలు, ఈగలు దుర్వాసన వెదజల్లుతోంది. వీటికి పరిష్కారాన్ని చూపాల్సి ఉంది. అధికారులు స్పందించి ఇలాంటి ఖాళీ ప్రదేశాల్లో నీళ్ల నిల్వ ఉండకుండా చేయాలి.

వరద నివారణకు పరిష్కారం చూపాలి

యల్లంపల్లి వెంకట్రావ్,35వ డివిజన్ కార్పొరేటర్



ఖమ్మం శివారుగా 35వ డివిజన్ ఉంది. ఇక్కడ ప్రధానంగా వరద నివారణకు పరిష్కారాన్ని చూపాలి. నగరంలోని నుంచి వచ్చే వరద, మురుగునీరు, మున్నేటి వరదతో కాలనీలన్నీ క్షణాల్లోనే మునిగిపోతున్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, కరెంట్ సమస్యలు వేధిస్తున్నాయి.

రైతుభరోసా వెంటనే విడుదల చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య



నేలకొండపల్లి పీఏస్సార్ సెంటర్లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నేలకొండపల్లి,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా నేలకొండపల్లిలో బీఆర్ఎస్ ధర్నా నిర్వహించింది. హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ధర్నానుద్దేశించి బ్రహ్మయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఏహామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో ఆరు హామీలను ఇచ్చారని, అందులో ఏహామీని అమలు చేయలేదన్నారు. కేసీఆర్‌ను ఓడించి తప్పు చేసామని రైతులు వాపోతున్నారన్నారు. కాంగ్రెస్‌ది ప్రజా వ్యతిరేక ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్, పైనంపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, పార్టీ మండల కార్యదర్శి వెన్నెబోయిన శ్రీను నాయకులు షేక్.హుస్సేన్, మరికంటి రేణుబాబు,మాగంటి మధుసూధన్‌రావు, గోలుసు రవి, కొండా కనకప్రసాద్ పాల్గొన్నారు.

పకడ్బందీగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ఆడిటింగ్



డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆడిటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తోన్నట్లు గృహనిర్మాణశాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఖమ్మం నగరంలోని వైయస్సార్ నగర్ కాలనీ, మల్లెమడుగులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం భాగస్వామ్యంతో నిర్మించిన ఇళ్ల ఆడిటింగ్ ప్రక్రియను కేంద్ర బృందాలతో కలిసి నిర్వహించారు. లబ్ధిదారులు వివరాలను సేకరిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా, మౌళిక వసతులు కల్పన, ఇంటిలో ఉన్న లబ్ధిదారుల వివరాలు పోర్టల్‌లోని వివరాలతో సరి చూస్తూ ఆడిట్ నిర్వహించింది. వైయస్సార్ నగర్ లో నిర్మించిన 204 ఇళ్లు, మల్లెమడుగులో నిర్మించిన 106ఇళ్లకు ఆడిటింగ్ ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఆడిటింగ్ అనంతరం కేంద్ర బృందం లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలో కల్పించిన వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోఎస్టీఎం సాయిజ్ఞానేందర్, ఎస్సార్పీ. చెన్న కేశవులు,ఏపీసీ అంజగౌడ్, టీడబ్ల్యుఐడీ డీఈబీరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ కె.లక్ష్మీనారాయణ, హౌజింగ్ సీఎల్టీసీ సిరాజ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక



జిల్లా బాలికల బాస్కెట్‌బాల్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 17 బాల, బాలికల ఖో-ఖో, బాస్కెట్‌బాల్, చెస్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు హాజరైనారు. ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అభినందనలు



కూసుమంచి,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మద్దులపల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన భైరు హరినాథబాబును లక్ష్మీతరుపతమ్మ తల్లి సేవాసమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బాధ్యులు రాంబాబు, గురుస్వాములు ఎల్.వీరబాబు, వెంకటేశ్వర్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి హోమం



ఖమ్మంసాంస్కృతికం,అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): లోకకళ్యాణం, సనాతన ధర్మపరిరక్షణ వర్ధిల్లాలని కాంక్షిస్తూ విశ్వహిందూ పరిషత్, గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం వైరా రోడ్‌లోని పవనసుత జలాంజనేయస్వామిదేవాలయంలో గాయత్రి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 24 హోమ గుండాలను ఏర్పాటు చేసి 96 మంది దంపతులచే గాయత్రిహోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, కార్యదర్శి బొడ్డు కృష్ణ, నగర అధ్యక్షకార్యదర్శులు, టీవీ రాజు, శ్రీనివాస్, కొనకంచి నాగమణి పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతమవ్వాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతమవ్వాలని ఎస్‌బీఐ ఆర్‌సేటీ డైరెక్టర్ చంద్రశేఖర్ కోరారు.పిండిప్రోలులో దివ్యాంగులకు పదిరోజుల పాటు వ్యాపారాభివృద్ధి, నైపుణ్య శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన వారికి ఆదివారం సర్టిఫికెట్లు అందించారు. ఈకార్యక్రమంలో అనేబుల్ ఇండియా రాష్ట్ర మేనేజర్ కొత్త మల్లిఖార్జున్, ఎస్‌ఆర్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ రాంబాబు, మల్లికార్జున్, పాల్గొన్నారు.



నేటినుంచి ఫార్మసీ ప్రవేశాల కౌన్సిలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబర్ 20(ఆంధ్రజ్యోతి): టీజీఎప్‌సెట్ 2024 ద్వారా బి ఫార్మసీ, ఫార్మాడీ కోర్సులలో ప్రవేశాలు పోందే విద్యార్థులకు సోమవారం నుంచి ఈనెల 23 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరూల్లా తెలిపారు. విద్యార్థులు సంబందిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

పాత పద్దతిలోనే గ్రూప్ 1 మెయిన్స్ నిర్వహించాలి

ఖమ్మంటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 29ని రద్దు చేసి పాత పద్దతిలోనే గ్రూప్ 1 మెయిన్స్ నిర్వహిచాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసద్‌భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కోర్టు కేసులు లేకుండా అభ్యర్థులు సమస్యల పరిష్కరించి గ్రూప్ 1మెయిన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు దీనిని మార్చి అభ్యర్థులు నష్టపోకుండా రిజర్వు కోటాలో ఉంచాలన్నారు. దీనిపై పోరాటం చేస్తున్న అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్1 పరీక్షలు పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేసి తర్వాత ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించినప్పటికీ బయెమెట్రిక్ సమస్యలతో ఈ పరీక్షను రద్దుచేశారన్నారు. యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్‌టికెట్ల నెంబర్లతోటే మెయిన్ ఆన్సర్ బుక్‌లెట్లపై ముద్రించి పరీక్ష నిర్వహించాలని కోరారు. ఈసమావేశంలో మద్దోజు శ్రావణ్, వంశీ, రాకేష్, ప్రతాప్, సునిల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతు వెతలను కళ్లకు కట్టిన 'హాలికులు సేమమా'



ఖమ్మంసాంస్కృతికం,అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి సమాజానికి అన్నం పెడుతున్న రైతన్నల క్షేమం ఎవరు పట్టించుకోవాలి, ఆదుకునేందుకు చేపట్టాల్సిన చర్యలేమిటి, వారు క్షేమంగా ఉన్నారో లేదో ఆలోచించేదెవరు అన్న చర్చను లేవనెత్తుతూ సాగిన హాలికులు సేమమా నాటిక ప్రతీఒక్కరినీ ఆలోచింప చేసింది. నెలానెలా వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనాటికను ప్రదర్శించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ద ళారుల ధరలదోపిడీ తదితర రైతుల వెతలను ఈనాటిక కళ్లకు కట్టినట్లు చూపింది. గుంటూరులో జరిగిన సంఘటనల ఆధారంగా 1990లో ఈనాటికను రూపొందించారు. రైతులు ఎదుర్కొంటున్న అగచాట్లు, దోపిడీ తదితర దయనీయ పరిస్థితులు నేటికీ అదే తీరుగా ఉండటంతో ప్రేక్షకులు నాటికలో లీనమయ్యారు. జరుగుల రామారావు, కొమ్మాప్రసాద్ సంయుక్తంగా రచించిన ఈనాటికు నంది అవార్డు గ్రహీత దేవేంద్ర దర్శకత్వం వహించారు. విద్యావేత్తలు వంగా సాంబశివరెడ్డి, బొమ్మా రాజేశ్వరరావు, వై.విక్రమ్, నెలనెల వెన్నెల నిర్వాహకులు ఎఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహనరావు, వేములు సదానంద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ యూనివర్సిటీ దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీలో చేరేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని ప్రాంతీయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా.చీపు పూర్ణ చంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన వారు డిగ్రీలో చేరేందుకు అర్హులు అని, అదేవిధంగా డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెలాఖరు తుది గడువు అని, వివరాలకు 73829 29742 సంప్రదించాలని ఆయన కోరారు. జేవీఆర్ ప్రభుత్వ కళాశాలల(142)లో నిర్వహిస్తున్న ఈ అధ్యయన కేంద్రానికి ఆయన ఇటీవల సమన్వయకర్తగా నియమించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.గోపి హర్షం వ్యక్తం చేశారు.

బీటీ రోడ్డు మంజూరు పట్ల హర్షం



ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను సన్మానిస్తున్న సూర్యతండా గ్రామస్థులు

కారేపల్లి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావోజితండా నుంచి అప్పాయిగూడెం వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.రెండు కోట్లను మంజూరు చేయించారు. గత పాలకులు ఈరోడ్డు గురించి పట్టించుకోలేదని, గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన చెవుల వెంకటేశ్వర్ల చొరవతో వర్లల్ బ్యాంకు నిధులు నుంచి సూర్యతండాకు బీటీ రోడ్డుకు కృషి చేశాడు. రోడ్డు పరిస్థితి సూర్యతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సీహెచ్ వినోద్‌కుమార్ పలుమార్లు ఎమ్మెల్యేను కలసి రావోజితండా నుంచి సూర్యతండా ద్వారా అప్పాయిగూడెం వరకు గల రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు మంజూరు చేయించారు. ఈసందర్భంగా ఆదివారం వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగోత్‌రవి, జర్పల ప్రసాద్, బాదవత్ రాజు, తదితరులున్నారు.

బదిలీల వెనక ఆంతర్యం ఏమిటీ..?



» మూకుమ్మడిగా వ్యవసాయ అధికారుల బదిలీలు » పోలీస్‌శాఖలోనూ బదిలీలు తప్పవంటూ ప్రచారం ?

మధిరటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో ఇటీవల మండల వ్యవసాయ అధికారులను ప్రభుత్వం మూకుమ్మడిగా బదిలీ చేయడంతో ఉద్యోగవర్గాలతో పాటు, రాజకీయ వర్గాలలోను బదిలీల వెనుక ఆంతర్యం ఏమిటీ అంటూ జోరుగా చర్చ జరుగుతుంది. వ్యవసాయశాఖలో సాధారణ బదిలీల్లో నెల క్రితమే బదిలీలు జరిగినప్పటికీ, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కొందరు ఏవోలను ఒకేసారి బదిలీ చేశారు. ఇటీవల బాధ్యతలు తీసుకున్న వారిని నెల రోజుల్లోనే మళ్లీ బదిలీ చేస్తే అధికారులు కోర్టుకు పోయే ప్రమాదం ఉండటంతో వారిని పక్క జిల్లాకు ఓడీ మీద బదిలీ చేయడంతో, వీరు పాత మండలంలోనే జీతాలు తీసుకుంటూ, కొత్త మండలంలో పని చేసేలా ఆదేశాలు ఇచ్చారు. పోనీ వీరి పని తీరు బాగాలేక బదిలీ చేశారనుకుంటే వీరి స్థానంలో అనుభవం ఉన్న వారిని కాకుండా, ఇటీవల కొత్తగా రిక్రూట్ అయిన వారికి అన్ని మండలాల్లో ఏవోలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు, పోస్టింగ్ తీసుకున్నవారు వెంటనే బాధ్యతలు స్వీకరించి, తదనంతరం శిక్షణకు వెళ్లారు. ఒక్క వ్యవసాయ శాఖలోనే కాకుండా మిగతా శాఖల్లో కూడా బదిలీలు చేపట్టారు.

మధిర కమిషనర్‌తో పాటు....

ఇతర శాఖల్లో కూడా బదిలీలు

ముదిగొండ మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, విద్యుత్ ఏడీఈని సైతం బదిలీ చేశారు. బోనకల్‌లో ఎంపీడీవోతో పాటు విద్యుత్ ఏఈని బదిలీ చేయగా, ఎర్రుపాలెం మండలంలో విద్యుత్ శాఖకు చెందిన ఏఈని బదిలీ చేయగా, మధిర మునిసిపల్ కమిషనర్‌తో పాటు విద్యుత్ శాఖలో ఓ ఏఈని బదిలీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకువస్తుండటంతో ఆయన అంచనాలకు అనుగుణంగా కొందరు అధికారులు పని చేయడం లేదని గుసగుసలు వినపడుతున్నాయి. మధిర మునిసిపల్ కమిషనర్‌ను భట్టీ తన పని తీరు మార్చుకోవాలని, పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని పలుమార్లు హెచ్చరించినా పనితీరు మారక పోవడం వల్లనే వచ్చిన ఆరు నెలలకే బదిలీ చేయాల్సి వచ్చిందని చర్చించుకుంటున్నారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లతో పాటు నూతన పెన్షన్లు అమలుకు ప్రభుత్వం యత్నిస్తుండటంతో నియోజకవర్గంలో ఇంకా పలువురు అధికారులు త్వరలో బదిలీ కానున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. పోలీస్ శాఖలో కూడా బదిలీలు ఉంటాయని, ఇసుక అక్రమరవాణాలో కొందరు అధికారులు అలసత్వం వహిస్తున్నారని భట్టీ దృష్టికి రావడంతో ఆయన హెచ్చరికల ఫలితంగానే ఇటీవల అందరు ఎస్ఐ లు ప్రెస్‌నోట్ లు పెట్టి ఇసుక అక్రమరవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారని తెలుస్తోంది. మధిర నియోజకవర్గం ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దు కలిగి ఉండటంతో కొన్ని మండాలల్లోని సరిహద్దు ప్రాంతాల్లోని పొలాల్లో ఇరు రాష్ట్రాలకు చెందిన వారు పేకాట ఆడుతున్నారని ఇది తెలిసినా కొందరు ఎస్ఐలు ఉదాసీనంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి, దీనితో ఈ శాఖలో కూడా బదిలీలు తప్పవనే ప్రచారం జరుగుతుంది. ఇది తెలిసిన కొందరు అధికారులు తమ పోస్టింగ్ ను నిలుపుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కొణిజర్ల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే శరణ్యం అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొణిజర్లలో మోత్కూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, శ్రీనివాసరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, చింతపల్లి ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, అంజయ్య పాల్గొన్నారు.

‘పీఆర్సీని వెంటనే ప్రకటించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

తల్లాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ.నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కార్యదర్శి షేక్.రంజాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా నమోదు చేయించుకోవాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘం నూతన మండల అధ్యక్షుడిగా షేక్.లాల్‌సాహెబ్, కార్యదర్శిగా తాళ్లూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీరబాబు, కె.శ్రీకాంత్, సుధాకర్, పాపయ్య సైదులు, మురళీకృష్ణ, సుదా రామారావు, ప్రగతికుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే మట్టా రాగమయి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం తల్లాడ మండలం మంగాపురం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగాపురం నుంచి పరిసర గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రాంబాబు, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి, రాయల రాము పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

తల్లాడ, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): పెద్దనాన్న అంత్యక్రియల్లో పాల్గొని అత్తారింటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అంబేద్కర్‌నగర్ వద్ద ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. బిల్లుపాడు గ్రామానికి చెందిన నల్లగట్ల జయరాజు(35), బిల్లుపాడులో అనారోగ్యంతో మృతి చెందిన స్వయాన పెద్దనాన్న నల్లగట్ల మంగయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం బిల్లుపాడు నుంచి కొణిజర్ల మండలం పల్లిపాడులోని అత్తారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అంబేద్కర్‌నగర్ వద్ద హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెం వద్ద జాతీయ రహదారిలో గుంతలను తప్పించబోయి కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దైవదర్శనం చేసుకొని భద్రాచలం నుంచి వైరా వైపు వస్తున్న బైక్‌ను ఎదురుగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వైరాకు చెందిన బత్తుల మురళీకృష్ణ, జగ్గయ్యపేటకు చెందిన బత్తుల నర్సింహారావు అతడి కుమారుడు బత్తుల ఉజ్వల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మురళీకృష్ణ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో కారు అదుపుతప్పి వరిపొలాల్లోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బయటపడాడు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు క్షతగాత్రులను 108వాహనంలో చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

‘రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలి’

మధిరటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి రైతుకు రైతు భరోసాను వెంటనే ఇవ్వాలంటూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మధిరలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పూర్తయ్యి, మరో నెలలో రబీ సీజన్ రానున్నప్పటికీ ఇంత వరకు రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఎకరాకు రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని లేకపోతే మరింత ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు, శివాలయం మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, ప్యారి, కటికల సత్యనారాయణ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: రైతు భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ముదిగొండ ప్రధాన సెంటర్లో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో భాగంగా రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు పోట్ల వెంకటప్రసాద్, బంకా మల్లయ్య, సీతరామయ్య, భిక్షం, శ్రీను పాల్గొన్నారు.

బోనకల్: స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ బందం శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ముదిగొండలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మధిరలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు మాటూరు హైస్కూల్ విద్యార్థినులు

మధిరరూరల్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీలలో మండలంలోని మాటూరు హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలలో అండర్-17 ఖోఖో పోటీల్లో మాటూరు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మేడిశెట్టి మహాలక్ష్మి, అండర్-14లో 9వతరగతి చదువుతున్న చిలువేరే జయశ్రీలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం, పీడీలు అభినందించారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో వేంచేసియున్న విజయదుర్గ అయ్యప్ప ఆలయంలో మహా పడిపూజ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తిగీతాలను ఆలపించారు.

వైరా మునిసిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో రూ.వంద కోట్ల అభివృద్ధి పనుల ప్రతిపాదనల కోసం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదివారం మునిసిపల్ పాలకవర్గం, అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగస్టు15న సీఎం రేవంత్‌రెడ్డి వైరా వచ్చిన సందర్భంగా మునిసిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వినతిపత్రం సమర్పించారు. ఆమేరకు రూ.వందకోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశిస్తూ మునిసిపల్ కార్యాలయానికి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారిక సమాచారం అందింది. దాంతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వైరా నుంచి సోమవరం వరకు అలాగే పల్లిపాడు వరకు సెంట్రల్ లైటింగ్ నిర్మాణం, క్రాస్‌రోడ్డు వద్ద రింగ్‌రోడ్డు నిర్మాణం, కూరగాయల మార్కెట్ రోడ్డు అభివృద్ధి, వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని ఇందిరమ్మ కాలనీ నుంచి వైరా కుడి కాల్వ కట్టపైన గండగలపాడు వరకు రోడ్డు నిర్మాణం, డంపింగ్‌యార్డు నిర్మాణం, సత్రంబజార్ రోడ్డు అభివృద్ధి, కేవీసీఎం రోడ్డు అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని సమీక్ష సమావేశంలో చర్చించారు. అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్, కమిషనర్ సూతకాని జైపాల్, చింతా వేణు, పాల్గొన్నారు.

గాదె సత్యంకు మంత్రి తుమ్మల పరామర్శ



గాదె సత్యంతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ సభ్యుడు గాదె సత్యంను వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆదివారం స్థానిక కాకర్లపల్లి రోడ్డులోని ఆయన నివాస గృహంలో ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాదె సత్యం ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స అనంతరం స్వగ్రామం రాగా మంత్రి కలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తదితరులు ఉన్నారు.

మాతృమూర్తికి నివాళులర్పించిన రాయల



కమలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాయల

ముదిగొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాతృమూర్తి నాల్గో వర్థంతిని మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. మాతృమూర్తి కమలమ్మ విగ్రహానికి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయల వెంకటేశ్వర్లు, కొమ్మినేని రమేష్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలికి నివాళి



సామ్రాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బోనకల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, సీపీఐ నాయకురాలు మందడపు సామ్రాజ్యం ఇటీవల చెందింది. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర పామిదత్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, ఏనుగు గాంధీ, పారుపల్లి నర్సింహారావు, రామారావు తదితరులున్నారు.

‘సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయండి’

ఏన్కూరు, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): ఆరికాయలపాడు గ్రామంలో ఈనెల 25న జరిగే సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి దంతెబోయిన నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిలుగా జాతీయ నాయకుడు మందడపు సాయిబాబా, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొంత రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మేరుగు సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు.

ప్రకృతి వర్ణశోభితం

తల్లాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో వెండి వర్ణ మబ్బులు నడుమ నీలిరంగు కనకగిరి గుట్టలు, అవనిపై పుడమి పురుడు పోసుకున్నట్టు పచ్చని వరి పైర్లతో ప్రకృతి పరవశించిపోయింది. ఆదివారం ఈ అరుదైన దృశ్యం వెంగనపేట(గూడూరు) వద్ద ప్రకృతి ప్రేమికులను నయనందకారపర్చింది.



వెంగన్నపేట వద్ద ప్రకృతి వర్ణశోభిత దృశ్యం

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి విగ్రహం

బోనకల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర కనుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ భూక్యా సైదా నాయక్, బీపీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.